# రాహుల్‌పై ఎఫ్ఐఆర్ రాజకీయ వేధింపులే

**పార్లమెంటులో విమర్శల భయం అందుకే రహుల్ లక్ష్యంగా కేంద్రం వేధింపులు**

**ప్రతిపక్షాలను అణగదొక్కే ప్రయత్నాలే ఈడీ కేసుల అసలు ఉద్దేశ్యం**

**'విజన్ 2047'తో సమగ్ర తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా తీర్చిదిద్దే లక్ష్యం**



హుస్నాబాద్,జనత న్యూస్: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దురదృష్టకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ తదితర సంస్థలు బీజేపీ అనుబంధ సంఘాలుగా వ్యవహరిస్తూ.. ప్రతిపక్ష నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు.

**వైఫల్యాలను ప్రశ్నిస్తారనే..**

గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో వైఫల్యాలు, రఫేల్ కుంభకోణం, కశ్మీర్ దాడులు, బీహార్ పేలుళ్లు, హిందుత్వ ప్రేరేపిత దాడులు, ఓట్ల తొలగింపు వంటి అంశాలపై పార్లమెంటు సమావేశాల్లో రాహుల్ గాంధీ ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతోనే కేంద్రం ఈ చర్యలకు దిగుతోందని మంత్రి పొన్నం ఆరోపించారు. సభలో చర్చ జరగకుండా చూడాలనే కుట్రలో భాగంగానే ప్రతిపక్ష నాయకుడిని కేసులతో ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో అంటకాగే నేతలు ఎంతటి అవినీతికి పాల్పడినా వారికి తప్పుగా కనిపించడం లేదని, ప్రశ్నించే గొంతుకలపై మాత్రం కేసులు బనాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్న రాహుల్ గాంధీకి ఇటువంటి వేధింపులు కొత్తేమీ కాదని, ఆయన దేనికీ భయపడరని, కేంద్రం చేసే తాటాకు చప్పుళ్లకు వెనకడుగు వేయరని స్పష్టం చేశారు. అలాగేమారుతున్న కాలానికి అనుగుణంగా 'రైజింగ్ తెలంగాణ' నినాదంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. గతంలో చంద్రబాబు 'విజన్ 2020'తో ముందుకు వెళ్లారని, ఆ తర్వాత వచ్చిన కేసీఆర్ 'బంగారు తెలంగాణ' అన్నారని గుర్తుచేశారు. అయితే ఆ బంగారు తెలంగాణ వారి ఇంటి నుంచి బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. తాము మాత్రం 'విజన్ 2047' లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. హైదరాబాద్ లో అనుకూలమైన వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నీటి వసతులు, మెరుగైన రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం, కాలుష్య రహిత వాతావరణంతో తీర్చిదిద్ది... హైదరాబాద్‌ను దేశంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దుతాం అని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించి.. అర్బన్ (పట్టణ), సెమీ అర్బన్, రూరల్ (గ్రామీణ) ప్రాంతాల వారీగా ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేస్తాం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ను అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంచుతూ, దేశానికే దిక్సూచిలా తెలంగాణను మారుస్తాం మన్నారు. ఈ ప్రయత్నంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# డిజిటల్ మీడియాపై చిన్నచూపు తగదు

**హుస్నాబాద్ జర్నలిస్టుల ఆవేదన**

**ప్రధాన పత్రికల వారికే పెద్దపీట.. మాపట్ల వివక్ష ఎందుకు?**

**ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ ఏకపక్ష వైఖరే**

**హుస్నాబాద్,జనత న్యూస్:** హుస్నాబాద్ డివిజన్ కేంద్రంగా పనిచేస్తున్న మీడియా వర్గాల్లో అంతర్గత విభేదాలు, అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిత్యం వార్తా సేకరణలో నిమగ్నమైన డిజిటల్ మీడియా ప్రతినిధుల పట్ల వివక్ష కొనసాగుతోందని, తమకు దక్కాల్సిన గుర్తింపు, గౌరవం దక్కడం లేదని పలువురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మీడియా తీరు చిన్న, పెద్ద అనే తారతమ్యంతో కొనసాగుతోందని వారు ఆరోపించారు. కేవలం ప్రధాన పత్రికల్లో (మెయిన్ స్ట్రీమ్) పనిచేస్తున్న వారి మాటలనే అధికారులు, ప్రజాప్రతినిధులు వేదవాక్కుగా తీసుకుంటున్నారని, డిజిటల్ మీడియా ద్వారా ప్రజలకు త్వరితగతిన సమాచారం చేరవేస్తున్న తమను పూర్తిగా విస్మరిస్తున్నారని వాపోయారు. ముఖ్యంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలోనూ ఏకపక్ష వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఓ వర్గానికి చెందిన వారి సూచనలకే ప్రాధాన్యం ఇస్తూ, తమ విషయంలో మాత్రం 'చేస్తాం.. చూస్తాం..' అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో మీడియా అంతా ఒకేలా పనిచేస్తున్నప్పుడు, మంత్రి స్థాయిలో ఉన్నవారు ఒక వర్గాన్ని మాత్రమే విశ్వసించి నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. సాంకేతికత పెరిగిన ప్రస్తుత తరుణంలో డిజిటల్ జర్నలిజం కూడా ప్రధాన పాత్ర పోషిస్తోందని, దీనిని గుర్తించి అందరినీ సమానంగా చూడాలని కోరారు. ఇప్పటికైనా మీడియాలో వర్గ విభజన మానుకుని, డిజిటల్ జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పించి, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కోరుట్ల గడి బురుజులు- మహిషాసుర మర్ధిని స్థల పరిరక్షణకు అఖిలపక్ష -ప్రజాసంఘాల పిలుపు



కోరుట్ల, జనతా న్యూస్: కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక గడి బురుజులు మరియు ప్రతిఏటా దుర్గదేవి పూజల అనంతరం నిర్వహించే మహిషాసుర మర్ధిని స్థల పరిరక్షణ కోసం ఈరోజు సి. ప్రభాకర్ భవనంలో అఖిలపక్ష, ప్రజా సంఘాల సమాఖ్య ముఖ్య సమావేశం జరిగింది. వివిధ పౌర సంఘాలు, సామాజిక కార్యకర్తలు, మత%-%సామాజిక సంస్థల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో గడి బురుజులు మరియు మహిషాసుర మర్ధిని స్థల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి. కన్వీనర్ సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, కో-కన్వీనర్: సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముజాహిద్, టిడిపి నాయకులు శ్రీనివాస్ బాబు, తెలంగాణ జర్నలిస్ట్ వర్కింగ్ అసోసియేషన్ ఫౌండర్ రాష్ట్ర అధ్యక్షులు టైగర్ అలీ నవాబ్ ముఖ్య సలహాదారులు : ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్, మచ్చ లక్ష్మీపతి, పాతర్ల విజయ్, సుతారి రాములు, పసుల కృష్ణప్రసాద్, రాచకొండ పెద్ద దేనన్న, భూపెల్లి నగేష్, సయ్యద్ అన్వర్ లతో పాటు పట్టణానికి చెందిన మరికొన్ని కుల సంఘాలను, పాత్రికేయులను, న్యాయ వాదులను భాగస్వామ్యం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ చెన్న విశ్వనాథం గారి ఆధ్వర్యంలో 8 డిసెంబర్ 2025 సోమవారంనడు కోరుట్లలో భారీ ధర్నా నిర్వహించేందుకు సమావేశం తీర్మానించింది.

అనంతరం నాయకులు మాట్లాడుతూ కోరుట్ల గడి బురుజులు మన పూర్వీకుల ఆస్తి, మన చారిత్రక గుర్తింపు. ఈ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమాల బారిన పడనివ్వము. ప్రతి పౌరుడూ పరిరక్షణలో భాగస్వామి కావాలి అన్నారు. అదేవిధంగా మహిషాసుర మర్ధిని స్థలాన్ని కూడా సంపూర్ణంగా రక్షించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కోరుట్ల భాందవులు, దుర్గా మండలి నిర్వాహకులు, మత-సామాజిక సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఉద్యమానికి బలమివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కోరుట్ల పట్టణ ప్రజలందరూ 8వ తేదీ ధర్నాకు భారీగా హాజరై తమ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వ రక్షణలో ఐక్యంగా నిలవాలంటూ విజ్ఞప్తి చేశారు.

# హుస్నాబాద్ ప్రగతికి కొత్త ఊపు

**3న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ.. ఏర్పాట్లు ముమ్మరం చేయాలని మంత్రి పొన్నం ఆదేశం**

**నియోజకవర్గ అభివృద్ధికి బాటలు పడతాయని ఆశాభావం**


**కోడ్ అడ్డంకి లేకుంటే గౌరవెల్లి నిర్వాసితులకు చెక్కుల పంపిణీ**

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హుస్నాబాద్‌లోని సభాప్రాంగణాన్ని అధికారులు, ముఖ్యనేతలతో కలిసి మంత్రి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు హుస్నాబాద్‌కు రావడం హర్షణీయమన్నారు. సీఎం పర్యటనతో నియోజకవర్గంలో కొత్త ఉత్సాహం నెలకొందని, ఇక్కడి అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్, రీజియన్, సెమీ అర్బన్, రూరల్ ఏరియాలుగా విభజించి నిర్దిష్టమైన విజన్‌తో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. హుస్నాబాద్ సభ వేదికగా ముఖ్యమంత్రి ప్రధానంగా విద్య, వ్యవసాయం, ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ఇది ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సభ అయినప్పటికీ, పొరుగున ఉన్న సిద్దిపేట, హనుమకొండ జిల్లాల నుంచి కూడా ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాము ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదని, అయినప్పటికీ సీఎంపై ఉన్న అభిమానంతో గ్రామాల నుంచి ప్రజలే స్వచ్ఛందంగా సభకు తరలివస్తామని కోరుతున్నారని చెప్పారు.

ఈ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అడ్డంకిగా లేకపోతే, గౌరవెల్లి భూనిర్వాసితులకు ఇదే వేదికపై పరిహారం చెక్కులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# యాదగిరిగుట్టలో అయ్యప్పల 'గిరిప్రదక్షిణ'





యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరికొండ చుట్టూ అయ్యప్పమాల వేసుకున్న స్వాములు సోమవారం 'గిరిప్రదక్షిణ' నిర్వహించారు. తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద నరసింహస్వామి పాదాలకు అయ్యప్పస్వాములతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గిరిప్రదక్షిణ ఆరంభించారు. గిరిప్రదక్షిణలో పాల్గొనడానికి రాష్ట్ర నలుమూలల నుండి అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు తండోపతండాలుగా తరలిరావడంతో.. గిరిప్రదక్షిణ మార్గం పోటెత్తింది. కొండ చుట్టూ గిరిప్రదక్షిణ మార్గంలో కనుచూపు మేర అయ్యప్పస్వాములే కనిపించారు. నారసింహుడి నామస్మరణ, అయ్యప్ప శరణు గోషలతో గిరిప్రదక్షిణ మార్గం మార్మోగింది. గిరిప్రదక్షిణలో భాగంగా అయ్యప్ప మాల స్వీకరించిన స్వాములు రెండున్నర కిలోమీటర్లు కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణలు చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గిరిప్రదక్షిణ చేసిన అయ్యప్పలకు దేవస్థాన ఆఫీసర్లు ప్రత్యేక దర్శనం సదుపాయం కల్పించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ గిరిప్రదక్షిణలో దాదాపుగా 20 వేల మంది అయ్యప్పస్వాములు పాల్గొన్నారని ఆలయ అధికారులు సూత్రప్రాయంగా వెల్లడించారు.

